




అభివృద్ధి జరగాలి : కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పవన్..పవర్

4 గంటల పాటు ఏకధాటిగా సాగిన సమీక్షలు

- అన్ని వ్యవస్థలను గాడిలో పెడతాం
- ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల ఇసుక రాబడి
- స్థానిక సంస్థలకు ఇసుక సీనరేజీ ఎగవేత
- పంచాయతీ నిధులు మింగేసిన జగన్
- జలజీవన్ మిషన్ నిధులతో గ్రామాలకు నీళ్లు
- హోప్‌ఐలాండ్ ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి
- ఉప్పాడ సముద్ర కోత పరిశీలనకు నేడు నిపుణులు
- కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కాకినాడ (కలెక్టరేట్), జూలై 2: కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ శాఖ, పర్యావరణశాఖలపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన సమీక్షలో అన్ని అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగింది. ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టింది. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వకుండా దారి మళ్లించారు. వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయతీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినాడకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసింది. వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసింది. దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు.ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్కడున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కాకినాడ స్మార్ట్ సిటీకి సంబంధించి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల విషయంపై ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కేంద్రంతో మాట్లాడతారని తెలిపారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. సముద్రతీరాన్ని రక్షించే మడ అడవులను వైసీపీ పాలనలో నాశనం చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. హానికరమైన మలేషియన్ బ్రీడ్ రకం కోనో కార్పస్ మొక్కలను పచ్చదనం కోసం పెంచారని, వాటిని దశలవారీగా తొలగిస్తామని చెప్పారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోత వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, దాని పరిశీలనకు తాను బుధవారం వెళ్లనున్నట్టు తెలిపారు. చెన్నైకు చెందిన నిపుణుల బృందం పరిశీలనకు వస్తున్నట్టు చెప్పారు. వనాలు, జీవజాతుల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. వ్యవస్థలను అన్నింటినీ గాడిలో పెడతామని తెలిపారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, జేసీ రామసుందరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎస్పీ సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరం ధ్వంసం కాకుండా చర్యలు

ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందన్నారు. తద్వారా తీర సంరక్షణ చేపడుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్ చిత్రంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు నెహ్రూ,కొండబాబు, నానాజీ, సత్యప్రభ

నేడు పిఠాపురంలో పవన్ వారాహి సభ

పిఠాపురం/ఉప్పాడ, జూలై 2: పవన్‌కల్యాణ్ మూడో రోజు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకోనున్నారు. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడతారు. అక్కడ నుంచి 12 గంటలకు బయలుదేరి చేబ్రోలు నివాసానికి 12.45 గంటలకు చేరుకుంటారు. చేబ్రోలు నివాసంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్య నేతలను కలుసుకుంటారు.భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వారాహి బహిరంగ సభలో పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగిస్తారు. సభ అనంతరం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారు.

పనులపై నివేదిక ఇవ్వండి

పంచాయతీరాజ్‌పై సమీక్ష సందర్భంగా జిల్లా, మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల గురించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ ఈ పనులు జిల్లా అంతటా జరిగాయా, లేక కొన్ని మండలాల్లోనే జరిగాయా అన్న విషయంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో 1 జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తెలిపారు. జిల్లాలోని మునిసిపాలిటీల్లో విలీనానికి ప్రతిపాదించిన 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలోని 32 మండలాలకు నీరందించేందుకు రూ.1650 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద ప్రతిపాదించిన వాటర్‌గ్రిడ్ పథకం హెడ్‌వర్క్స్‌కు అవసరమైన 14 ఎకరాల భూసేకరణ పూర్తికాక పనులు ముందుకు సాగలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం-రాపర్తి మధ్య హైవే పనుల వల్ల సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు చెందిన పైపులైన్లు దెబ్బతినడంతో 17 ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్‌ఈ వివరించారు. నాగులాపల్లి స్కీమ్ ఇబ్బందులను తెలియజేశారు.

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు

కాలుష్యంతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాలుష్య నివారణ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ సంస్థపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేస్తున్న కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల్లో సాంకేతికపై ఆసక్తి కలిగేలా కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నారు.

పర్యాటక ప్రాజెక్టును కోరాం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాకు ప్రసాద్ పథకం కింద పర్యాటక ప్రాజెక్టు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు ప్రధానమంత్రి మోదీని కోరామని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ ఆగిపోయిన స్మార్ట్‌సిటీ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో ఏటిమొగ వద్ద ఉప్పుటేరుపై శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు.

మా గుర్తుగా..



పవన్‌కల్యాణ్‌ను సత్కరించి ఫొటోలతో కూడిన జ్ఞాపికను అందజేస్తున్న చేబ్రోలులో పవన్ నివాసం ఉంటున్న ఇంటి యజమాని కుటుంబసభ్యులు



కొత్త కలెక్టర్‌గా మహేష్‌కుమార్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రస్తుత కలెక్టర్ హిమాన్షు శుక్లాను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం

అమలాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెక్రటరీగా పని చేసిన ఆయన్ను కలెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుత కలెక్టర్ హిమాన్షు శుక్లాను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. కోనసీమ జిల్లా ఆవిర్భావం తరువాత మహేష్‌కుమార్ రెండో కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆలిండియాలో 189వ ర్యాంకు సాధించి అత్యుత్తమ ఐఏఎస్ అధికారిగా పేరొందారు. గతంలో ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవమున్న మహేష్‌కుమార్ జిల్లాకు కలెక్టర్‌గా నియమితులు కావడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా కోనసీమ జిల్లా ఆవిర్భావ సమయంలో తొలి కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లా సుమారు 27 నెలల పాటు జిల్లా ప్రజలకు సేవలు అందించారు. ఆయన సతీమణి కృతికా శుక్లా కాకినాడ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె సెలవులో ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జేసీ నుపూర్‌అజయ్

కులధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా జారీ చేయాలి

- జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకునేలా కులధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా జారీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఆదేశించారు. కుల వృత్తులను, వంశవృక్షాన్ని క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తహసీల్దార్లు రోజువారీగా 10 దరఖాస్తులు జారీ చేయాలన్నారు. తహసీల్దార్లు తమ లాగిన్‌కు వచ్చిన ప్రతి అంశాన్నీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం జేసీ జిల్లాలోని 22 మండలాల తహసీల్దార్లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రధానమైన మ్యూటేషన్లు, ల్యాండ్ కన్వర్షన్, పట్టా సబ్ డివిజన్, కుల ఆదాయ ధ్రువపత్రాలు, జనన మరణ ధ్రువపత్రాలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. వెబ్‌ల్యాండ్ పోర్టల్ నిర్వహణలో సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ మ్యూటేషన్‌లో పురోగతి సాధించాలన్నారు. సర్వే నంబరు వారీగా ఆర్డీవోలు ల్యాండ్ కన్వర్షన్ ప్రొసీడింగ్స్ జారీ చేయాలన్నారు. జనన, మరణ ధ్రువపత్రాల ప్రక్రియను ఆర్డీవో స్థాయిలోనే పూర్తి చేయాలన్నారు. కులధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తి నిర్దిష్ట కులానికి లేదా సంఘానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించి ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. అప్పుడే రాజ్యాంగ రిజర్వేషన్లు ఉపయోగించుకునేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ల్యాండ్ సర్వే విభాగం సహాయ సంచాలకుడు ఎ.ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్లు చినబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఓడలరేవు తీరంలో కొట్టుకుపోయిన ఓఎన్‌జీసీ రోడ్డును పరిశీలిస్తున్న కుడుపూడి

ఓడలరేవు తీరంలో రక్షణ చర్యలు చేపట్టాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎమ్మెల్సీ కుడుపూడి విజ్ఞప్తి

అల్లవరం, జూలై 2: తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలతో సముద్ర అలల కారణంగా ఓడలరేవు గ్రామానికి పెను ప్రమాదం పొంచి ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు. అల్లవరం మండలం ఓడలరేవులో సముద్ర అలల తాకిడికి ఓఎన్జీసీ ప్లాంటు ప్రహరీకి రక్షణగా ఉన్న రోడ్డు కొట్టుకుపోగా ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మంగళవారం పరిశీలించారు. తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు, ఓఎన్జీసీ అధికారులకు సూచించారు. 'సముద్ర అలలకు కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రోడ్డు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి జియో ట్యూబ్ టెక్నాలజీతో రక్షణగోడ నిర్మించాలని సూచించారు. తీర గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. శాసనమండలిలో ఈ సమస్యను ప్రస్తావిస్తానని తెలిపారు. ఆయన వెంట మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, గుత్తుల ధర్మ వున్నారు.



అమలాపురం రూరల్ మండలం చిందాడగరువులో మణికంఠకు రూ.15వేలు పెన్షన్ అందజేస్తున్న కూటమి నాయకులు, ఇన్‌సెట్‌లో మణికంఠ పాత చిత్రం

పెన్షన్ల పంపిణీ 99.08 శాతం పూర్తి

అమలాపురం టౌన్, జూలై 2: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ రెండో రోజైన మంగళవారం నాటికి 99.08 శాతం పూర్తయినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు 2,43,534 మంది ఉండగా వారిలో ఇప్పటికే 2,41,299 మందికి పెన్షను అందజేసినట్టు తెలిపారు. రూ.160,89,88,000 నగదు పంపిణీ చేయాల్సి ఉండగా రూ.159,40,85,000 బట్వాడా పూర్తి చేశామన్నారు. 22 మండలాల్లో ఇంకా 2,235 మందికి పెన్షన్ అందించాల్సి ఉన్నప్పటికీ వారిలో అత్యధికులు ఇతర రాష్ట్రాల్లో ఉండడంతో పాటు కొందరు మృతి చెందినట్టు గుర్తించామన్నారు.

ఆనందమానందమాయె...

అమలాపురం రూరల్, జూలై 2: అమలాపురం రూరల్ చిందాడగరువు గ్రామానికి చెందిన తాటికాయల సాంబశివరావు-సీతారత్నం దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు మోహనసత్యశ్రీసాయి (23), చిన్న కుమారుడు గిరీష్‌దుర్గామణికంఠ (18). వారిద్దరూ ఎనిమిదేళ్ల వయసు వచ్చే వరకు అందరిలా అల్లరి చేస్తూ పాఠశాలకు వెళ్లేవారు. ఆడుతూ పాడుతూ తిరిగిన బిడ్డలు ఒక్కసారిగా కండరాల వ్యాధి బారిన పడి మంచానికే పరిమితమైపోయారు. 2015లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆ బిడ్డలకు రూ.3వేలు చొప్పున దివ్యాంగ పెన్షన్ మంజూరైంది. బిడ్డలను సాకుతూ ఏ పనికీ వెళ్లలేకుండా తల్లిదండ్రులు ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితి. దానికితోడు వారికి అయ్యే మందుల ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. పరిస్థితిని అధికారులు, వైసీపీ పాలకుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు 2023 డిసెంబరు నెల నుంచి పెన్షన్‌ను రూ.5వేలకు పెంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే ఒక్కో బిడ్డకు పెన్షన్ మొత్తాన్ని రూ.5వేలు నుంచి రూ.15 వేలకు పెంచి రూ.30వేలు అందించారు. ఇంతకంటే భాగ్యం ఏముంటదని ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేవుడితో సమానమని వారు పేర్కొన్నారు.



మోహనసత్యశ్రీసాయి

ఆస్తుల పంపకంపై 'పంచాయితీ'

- కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ సమక్షంలో చెముడులంక, చొప్పెల్ల సర్పంచ్‌లు, గ్రామ పెద్దల సమావేశం
- కొలిక్కిరాని చర్చలు...
- మరోసారి చర్చకు ఇరువర్గాల అంగీకారం



ఇరు గ్రామాల పెద్దలతో సమీక్షిస్తున్న కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ

ఆలమూరు, జూలై 2: ఒక గ్రామాన్ని పరిపాలనాపరంగా రెండు గ్రామాలైతే చేయగలిగారు. కానీ ఆస్తుల పంపకం మూడు దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చెముడులంక, చొప్పెల్ల మధ్య ఆస్తుల వివాదం నేటికీ తెరపడలేదు. దానిని వివాదం పరిష్కరించరించడానికి కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ మంగళవారం ఇరు గ్రామాల సర్పంచ్‌లు, పెద్దలతో సమీక్షించారు. సయోధ్య కుదరకపోవడంతో మరోసారి చర్చించేందుకు నిర్ణయించారు.

చొప్పెల్ల పంచాయతీని రెండు గ్రామాలుగా విడదీయాలని 1995లో పలువురు కోరారు. దాంతో చొప్పెల్ల నుంచి చెముడులంకను విడదీసి వేరే పంచాయతీగా ఏర్పాటుచేస్తూ అప్పటి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చెముడులంక ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. 1 నుంచి 74 సర్వే నెంబరు వరకు చెముడులంక పంచాయతీకి, 75 నుంచి మిగిలిన సర్వే నెంబర్లు చొప్పెల్ల పంచాయతీకి చెందేలా ఆస్తులను పంపకం చేస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ పంపకం ద్వారా చొప్పెల్ల పంచాయతీకి భారీగా నష్టం జరుగుతుందని, అందువల్ల ఈ పంపకంపై మరోసారి సమీక్షించాలని కోరుతూ అప్పటి చొప్పెల్ల సర్పంచ్ దంగేటి పెద్ద సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచీ ఆస్తుల పంపకం నిలిచిపోయింది. దీంతో తమ గ్రామానికి రావాల్సిన ఆదాయం రావట్లేదని, 1995లో విభజన సమయంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ 2023లో హైకోర్టును ఆశ్రయించారు.

సరిహద్దులను పరిశీలించిన అధికారులు, పెద్దలు

చొప్పెల్ల, చెముడులంక గ్రామాల మధ్య ఉన్న ఆస్తుల పంపకం వివాదాన్ని పరిష్కరించేందుకు కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ అధ్యక్షతన డీఎల్పీవో ఎ.రాజు, ఆలమూరు తహసీల్దారు అనిల్‌కుమార్, సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్, దంగేటి చంద్రకళ, రెండు గ్రామాల పెద్దలు సరిహద్దులను మంగళవారం పరిశీలించారు. అనంతరం వివాదం పరిష్కారం కోసం చర్చించారు. చెముడులంక పంచాయతీకి 1 నుంచి 27 వరకు మాత్రమే పరిధి ఉందని, అందువల్ల సర్వే నెం.74 వరకు ఇవ్వడం సాధ్యపడదని ప్రస్తుతం కొనసాగుతున్న విధానాన్నే కొనసాగించాలని చొప్పెల్ల గ్రామస్తులు కోరుతున్నారు. తమ గ్రామానికి ఆదాయ వనరులు లేవని, 1995 విభజన ప్రకారం విడదీసి ఇవ్వడంతో ఆదాయం లభిస్తుందని చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ చెప్తున్నారు. ఇరు వర్గాల మధ్య చర్చలు విఫలం కావడంతో మరోసారి సమావేశం ఏర్పాటుచేసి పరిష్కారం మార్గం చూపుతామని ఆర్డీవో సత్యనారాయణ తెలిపారు. చర్చల్లో ఇరు గ్రామాల నాయకులు మెర్ల గోపాలస్వామి, నైనాల శ్రీరామచంద్రమూర్తి, ఆకుల రామకృష్ణ, బల్ల హరికృష్ణ, సుంకర కామరాజు, తోరాటి దుర్గారావు, జాంప్రోలు వెంకట్రావు, బుడిగ వీరవెంకట్రావు, చంటి తదితరులు పాల్గొన్నారు.



సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరం

గోదావరి తీరంలో సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అదే మబ్బులు వేసిన సమయంలో మరింత అందాలు కనువిందు చేస్తాయి. ఇదేవిధంగా మంగళవారం ఉదయం పెరవలి మండలం తీపర్రువద్ద గోదావరి తీరానికి వెళ్లిన పలువురికి ఈ సూర్యోదయం ఎంతో ఆహ్లాదకర అనుభవాన్ని ఇచ్చింది.

-పెరవలి

15 వరకు భీమేశ్వరాలయంలో సంరక్షణ పనులు

ద్రాక్షారామ, జూలై 2: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మూలవిరాట్ సంరక్షణ పనులు ఈనెల 15వరకు కొనసాగనున్నాయి. ఈమేరకు పురావస్తుశాఖ అధికారులు ఈవో పి.టి.వి.సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమేశ్వరుడి మూల విరాట్, మాణిక్యాంబ అమ్మవార్లదర్శనం మరో కొన్నిరోజులు పట్టే అవకాశం ఉందని ఈవో తెలిపారు.

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- ఈనెల 7వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 8నుంచి 12వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు

జేఎన్టీయూకే, జూలై2: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆదివారం జారీ చేశారు. ఈనెల 7వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుచేసుకోవచ్చని కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే సహాయకేంద్రం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎన్.బాలాజీ తెలిపారు.

● ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 2 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలుండగా జేఎన్టీయూకేలోని యూసీఈకే, రాజానగరంలో గల అక్నూలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 950 సీట్లు, 32 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 15,400 సీట్లు మొత్తం 16,350 సీట్లున్నాయి. ఏపీఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్‌కు 14,250 మంది, ఫార్మసీకి 6,757 మంది అర్హత సాధించారు.

సందేశాల నివృత్తికోసం

●అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే జిల్లాలోని కాకినాడ జగన్నాధపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రంలోగానీ, కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకేలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో కానీ సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్‌చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్‌చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్‌వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్‌టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీ ఏడాది అమలుచేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

● ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్	: ఈనెల 7 వరకూ.
●ధ్రువపత్రాల పరిశీలన	: ఈనెల 4నుంచి 10వరకూ
●వెబ్ ఆప్షన్ల నమోదు	: ఈనెల 8నుంచి 12వరకూ
● ఆప్షన్ల మార్పు	: ఈనెల 13న
● సీట్ల కేటాయింపు	: ఈనెల 16న
● కళాశాలల్లో రిపోర్టింగ్	: ఈనెల 17నుంచి 22 వరకూ.
● తరగతుల ప్రారంభం	: ఈనెల 19 నుంచి

● విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి :

ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

● పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

రూ.40 లక్షలు గోల్‌మాల్!

- జి.ఎర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో ఘటన
- చెల్లింపులు, రికార్డుల్లోని వివరాల్లో తేడాలు
- బ్యాంకులో బీసీ పాయింట్ వ్యక్తిపై అనుమానాలు





స్వయంసహాయక సంఘానికి ఇచ్చిన రశీదు, వివరాలను తెలియజేస్తున్న డ్వాక్రా మహిళలు

దివాన్‌చెరువు, జూలై 2: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలంలోని జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో దాదాపు రూ.40లక్షలు మేర సొమ్ము గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తోంది. బ్యాంకులో బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి ఈ అవకతవకలకు పాల్పడినట్టు కొంతమంది ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు బ్యాంకు బ్రాంచి మేనేజర్ నిరాకరించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని కొందరికి ఫోన్లు వెళ్లడం, కొన్ని స్వయం సహాయక సంఘాలు చెల్లించిన సొమ్ముకు, బ్యాంకు రికార్డుల్లో నమోదైన సొమ్ములో తేడాలుండడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఖాతాదారుల సౌకర్యార్థం ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా బ్యాంకు నియమించుకుంది. ఖాతాదారులకు బ్యాంకు వెలుపల ఆ వ్యక్తి అందుబాటులో ఉండి సేవలందించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా జి.ఎర్రంపాలెంలోని బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి బ్యాంకు ఆవరణలోనే ఉంటూ డ్వాక్రా సంఘాలు, రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్ములో కొంత తానే కట్టించుకుని రశీదులు ఇచ్చేవారని కొంతమంది డ్వాక్రాసంఘాల సభ్యులు తెలిపారు. దీంతో వారంతా బ్యాంకు ప్రతినిధులే అయి ఉంటారని తాము అనుకున్నామన్నారు. ఆ గ్రామంలోని మేరీమాత స్వయం సహాయక సంఘానికి చెందిన కోనె లక్ష్మిని విలేకరులు ఈ విషయమై ప్రశ్నించగా ఐదు నెలలుగా తాము చెల్లించిన రూ1.20 లక్షలు సొమ్ము తేడా వచ్చిందన్నారు. తాము బ్యాంకులో చెల్లించిన సొమ్ము బాగానే ఉందని, బ్యాంకు ప్రతినిధి నానిబాబు అనే వ్యక్తికి చెల్లించిన సొమ్ములోనే ఈ వ్యత్యాసం వచ్చిందన్నారు. బ్యాంకుకు తాము వచ్చినపుడు రూ.10 వేలలోపు సొమ్మును తమ బ్యాంకు ప్రతినిధికి చెల్లించాల్సిందిగా కొంతమంది బ్యాంకు సిబ్బందే తమకు చెప్పేవారన్నారు. సుజాత గ్రూపునకు చెందిన దమ్ము దుర్గ మాట్లాడుతూ తమ సంఘానికి సంబంధించి రూ.20వేలు తేడా వచ్చాయన్నారు. శారదా గ్రూపునకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పోశమ్మ, యజ్ఞ కళ్యాణి మాట్లాడుతూ తమ సంఘం పొదుపు సొమ్ము బ్యాంకుకు రూ.92 వేలు చెల్లిస్తే తమ ఖాతాలో ఏడు వేలు మాత్రమే కనబడుతోందని చెప్పారు. రెండు సంవత్సరాల క్రితం తమకు రూ.60 వేలు రుణం వచ్చిందని, అప్పటి నుంచీ తమ ఖాతాలో పొదుపు సొమ్ములేదని గుర్తించామన్నారు. ఈ విషయమై యానిమేటర్‌ను అడగగా అప్పులు ఆలస్యంగా చెల్లించిన వారికి పొదుపు సొమ్ము అప్పుకు జమచేసి ఉండవచ్చని తెలిపారన్నారు. తాము ఈ లోపాలను గుర్తించి కొంతకాలంగా బ్యాంకు చుట్టూ తిరుగుతుంటే నాలుగు రోజుల్లో చెబుతామని సిబ్బంది అన్నారన్నారు. సత్యసాయి స్వయం సహాయక సంఘానికి సంబంధించి రూ.60 వేల వరకూ తేడా వచ్చినట్టు తెలిసింది. జి.ఎర్రంపాలెం, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాల్లోని 93 స్వయం సహాయక సంఘాల వారు ఈ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ఖాతాదారులు బ్యాంకు ద్వారా నగదు జమ, విత్‌డ్రా వంటి లావాదేవీలు జరిపినపుడు సంబంధిత పాస్ పుస్తకాల్లో ఎంట్రీలను ఎప్పటికపుడు సిబ్బంది నమోదుచేసి ఉంటే ఇటువంటి వాటికి ఆస్కారం ఉండేది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై బ్రాంచి మేనేజర్ బీఎస్ రాజును మంగళవారం విలేకరులు కలసి ప్రశ్నించగా వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు.

మహిళ అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పవన్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, జూలై 2: మహిళల అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారణలు నిర్వహించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసంలో పవన్‌ను మంగళవారం రాత్రి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై పవన్ ఐజీతో మాట్లాడారు. అదృశ్యమైన బాలికలు, మహిళలు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు, అందుకు గల కారణాలు ఏమిటి, అదృశ్యాలు వెనుక ఎవరు ఉన్నారు, కారణాలు ఏమిటి తదితర అంశాలన్నింటిపై దృష్టి పెట్టాలన్నారు. కాకినాడ జిల్లాలో గతంలో జరిగిన సంఘటనలు, ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. శాంతి భద్రతలు విఘాతం కలిగించేవారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

కొత్తపల్లి, జూలై 2: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందినట్టు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చొక్కా మసేను(52) అదే గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులతో మంగళవారం తెల్లవారుజామున వేటకు వెళ్లారు. సముద్రంలో వేట చేస్తుండగా కెరటాల ఉధృతికి మసేను సముద్రంలో పడి గల్లంతయ్యాడు. దీంతో సహచర మత్స్యకారులు వలలతో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఒడ్డుకు చేరుకున్నారు. సాయంత్రం 4గంటల సమయంలో మసేను మృతదేహం ఒడ్డుకు కొట్టుకొని రావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

హైడ్రామా

- అక్రమ కట్టడాలకు అండగా ద్వారంపూడి
- అధికారులపై వీరంగం.. అడ్డగోలుగా విరుచుకుపడ్డ చంద్రశేఖర్‌రెడ్డి
- అనుచరులతో దాడి.. ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు
- అధికారుల హెచ్చరికతో వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే



అధికారులపైకి దూసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

కార్పొరేషన్(కాకినాడ), జూలై2: అధికారంలో ఉన్నప్పుడు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అక్రమాలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవారు. ఆనాడు ప్రతిపక్షపార్టీల నేతలు ధ్వజమెత్తినా, బాధితులకు ఆక్రోశించినా పట్టించుకున్నవారే లేరు. పైగా అవేమీ తనకు సంబంధం లేదన్నట్టుగా ఈ మాజీ ఎమ్మెల్యే అప్పట్లో తన నోటికి పనిచెప్పి ఎంతోమందిని దుర్భాషలతో దూషించేవారు. ఆఖరికి మీడియాను సైతం బెదిరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇటీవల ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలయ్యారు. పదవిపోయిందనే, ప్రజలు తిరస్కరించారనే స్పృహ చంద్రశేఖర్‌రెడ్డికి ఇప్పటికీ కలగలేదు. తానింకా అధికారంలో ఉన్నట్టుగానే అటు ప్రజలపైనా, ఇటు అధికారులపైనా వీరంగం చేస్తున్నారు. అలాంటి సంఘటన కాకినాడలో గొడారిగుంట ప్రాంతంలో మంగళవారం జరిగింది. స్థానిక రాజ్యలక్ష్మినగర్‌లో వైసీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఒకరు అక్రమంగా ఒక భవంతుని నిర్మించాడు. మొదటి ఫ్లోర్ వరకు అనుమతులు ఉండగా, అప్పట్లో అధికారఅండతో అడ్డగోలుగా రెండో ఫ్లోర్ కూడా అధికారులను బెదిరించి నిర్మించేశారు. ఇది గమనించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు లేకుండా నిర్మించిన రెండో ఫ్లోర్‌ను కూల్చివేయాలని నోటీసులు ఇచ్చారు. వారం రోజుల కిందటే ఈ నోటీసులు ఇచ్చినప్పటికీ సంబంధిత వైసీపీ కార్యకర్త, చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఇసుమంతైనా స్పందించలేదు. కనీసం అధికారులకు జవాబు కూడా ఇవ్వలేదు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం రంగంలోకి దిగి రెండో అంతస్తు కూల్చే ప్రయత్నం ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఇంకా అధికారంలోనే ఉన్నట్టుగా అధికారులను బెదిరించారు. భవనం వద్ద ఉన్న దిగువస్థాయి అధికారులందరినీ వెళ్లిపొమ్మని హెచ్చరించారు. భవనం పైఅంతస్తు కూల్చే పని పర్యవేక్షిస్తున్న అధికారులను నిలువరించి తన అనుచరులతో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా రెండో ఫ్లోర్‌కి చేరుకుని అప్పటికే భవనాన్ని కూల్చడానికి కార్పొరేషన్ అధికారులు నియమించిన కూలీలపై మాజీ ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న ఇటుక రాళ్లు తీసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో పలువురు కూలీలకు కూడా గాయాలయ్యాయి. తప్పని పరిస్థితుల్లో అక్కడున్న కూలీలందరూ పక్క భవనంపైకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అంతటితో ఆగకుండా కింద ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు ద్వారంపూడి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇంతలో అక్కడున్న పోలీసులు ఎంత అడ్డుకుందామని ప్రయత్నించినా చంద్రశేఖర్‌రెడ్డి తన అనుచరులతో రెచ్చిపోయి ఎదురుదాడికి దిగారు. దుర్భాషలతో అధికారులను దూషించారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్లో ప్రయత్నించారు. నిబంధన ప్రకారమే ఈ చర్యలకు దిగామని, అక్రమ నిర్మాణాలపై చర్యలను అడ్డుకోరాదంటూ ఉన్నతాధికారుల నుంచి సమాధానం రావడంతో చేసేదిలేక ద్వారంపూడి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాగా టౌన్ ప్లానింగ్ అధికారి డీసీపీ హరిదాస్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అక్రమ నిర్మాణం విషయంలో అంతా నిబంధన ప్రకారమే జరుగుతోందని స్పష్టంచేశారు.

మొబైల్ యాప్ ద్వారా
విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్

అమలాపురం టౌన్, జూలై 2: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్, వెబ్‌సైట్ యాప్ ద్వారా చెల్లించవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. కాబట్టి వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సంస్థ వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. మొబైల్ యాప్, వెబ్ సైట్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, క్యాష్ కార్డులను కూడా వాడుకోవచ్చని పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత ఆకెళ్ల యశోద

అన్నవరం, జూలై 2: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల యశోద రూ.1,00,116లు విరాళంగా దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. సూపరింటెండెంట్ స్వామీజీ ఉన్నారు.

రీజెన్సీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

- గవర్నర్‌ను కలిసిన ఎండీ జీఎన్‌నాయుడు



గవర్నర్‌తో సీపీ రాధాకృష్ణన్‌తో మాట్లాడుతున్న రీజెన్సీ పరిశ్రమ చైర్మన్ జిఎన్ నాయుడు, ఎండీ సత్యేంద్ర ప్రసాద్

యానాం, జూలై 2: యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించి ప్రభుత్వ పరిధిలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించి పరిశ్రమను ఆదుకోవాలని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు, ఎండీ నారా సత్యేంద్రప్రసాద్ కోరారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మంగళవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమ ప్రగతికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని, పెండింగ్‌లో ఉన్న రీజెన్సీ సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరించేలా తోడ్పాడు అందించాలని, రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించి పరిశ్రమలను ఆదుకోవాలని జీఎన్ నాయుడు కోరారు. ముందుగా గవర్నర్ రాధకృష్ణన్‌ను రీజెన్సీ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈఅంశాలపై గవర్నర్ సానుకులంగా స్పందించారు.

ఇసుక పాలసీ ఎలా ఉంటుందో?



- ఎదురు చూస్తున్న ప్రజలు
- జిల్లాలో ఆగిపోయిన ర్యాంపులు
- జిల్లాలో ఇసుక కొరత
- కూటమి అధికారంలోకి రావడంతో పరారైన వైసీపీ ఇసుక దొంగలు
- కలెక్టర్ ఆదేశాలలో లెక్కలు కడుతున్న అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం, మళ్లీ సీఎంగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ఇసుక వినియోగదారులు, వ్యాపారులు, బోట్స్‌మన్ సొసైటీలు ఆనందంగా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినపుడు చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తేవడంతో భవన నిర్మాణ రంగం అభివృద్ధి చెందింది. భవన నిర్మాణ రంగం మీద ఆధారపడిన వేలాది కార్మికులు హ్యాపీగా ఉండేవారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా ఇల్లు కట్టుకోవాలంటే, ఇసుక ఇబ్బంది ఉండేది కాదు.కేవలం ఎగుమతి, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక ఇంటికి వచ్చేది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వినియోగదారుల కోణం నుంచి ప్రభుత్వం ఆలోచించలేదు. అంతా ఆదాయ మార్గంగానే ఆలోచించింది. పైగా బోట్స్‌మన్ సొసైటీలు, ఇసుక వ్యాపారు లందరినీ దెబ్బకొట్టి, కేవలం జిల్లాకు ఒకరిద్దరువ్యక్తులను పెట్టుకుని, వాళ్ల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిపిన సంగతి తెలిసిందే. జిల్లాల వారీ పెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చినట్టు మొదట్లో ఇసుక పాలసీ ప్రకటించినా తర్వాత దానిని ప్రక్కన పడేసి, వైసీపీ పెద్దలే ఇసుక బొక్కడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఓపెన్ ర్యాంపుల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర వైసీపీ నేతలు ఇసుక రంగంలోకి దిగి, బోట్స్‌మన్ సొసైటీలను తరిమేసి, వారిస్థానంలో తమ అనుచరులనుపెట్టుకుని ఇసుక డ్రెడ్జింగ్ చేయించి, దానిని వైసీపీ తరపున ఉన్న గుత్తేదార్లకు అందించేవారు. టన్నుకు రూ. 150నుంచి 200వరకూ రావడంతోపాటు బాట చార్జీలు అదనంగా వచ్చేవి. పార్కింగ్ చార్జీలు కూడా వసూలు చేసేవారు. మధ్యలో కొన్ని లారీలను లెక్కలో లేకుండా తప్పించేవారు. ర్యాంపుల వద్ద వైసీపీ తరపున వ్యక్తులు కాపాలా కాసీ, డిజిటల్ లావాదేవీలు లేకుండా, కేవలం నగదు లావాదేవీలే చేసేవారు. ఇక్కడ మరొక్క విషయం గమనించాలి. గతంలో ర్యాంపులు ఎంపిక చేయాలంటే ఇరిగేషన్, మైన్స్, భూగర్భజలశాఖ, రెవిన్యూ వంటి శాఖల అధికారులంతా పర్యటించి,అక్కడ సరిహద్దులు నిర్ణయించి, ఎంత ఇసుక తవ్వ కోవచ్చో లెక్క కట్టేవారు. దాని వివరాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో చర్చించి, పర్యావరణ అనుమతులు పొం దిన తర్వాత ఇసుక తీసుకోవడానికి అనుమతి ఇచ్చేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ లేవు.కేవలం వాళ్లు అనుకోవడం, తవ్వే సుకోవడం, అమ్మేసుకోవడం, డబ్బు మూటలు పట్టుకుని పోవడం అంతే జరిగింది. ఏ ర్యాంపులో ఎంత ఇసుక తవ్వారో కూడా లెక్కలులేని వైనం. మైన్స్ ఇరిగేషన్ ,రెవెన్యూ సెబ్, పోలీసు, భూగర్భజలశాఖ, అటవీ, సంబంధిత శాఖలన్నీ నిర్వీర్యమ య్యాయి. ఇరిగేషన్, మైన్స్ అధికారుల అనుమతి లేకుండా రూ.కోట్ల ఇసుక తవ్వేశారు. నెలకు రూ.10కోట్ల వరకూ వైసీ పీ పెద్దలకు కప్పం అందేది. కొవ్వూరులో వైసీపీ పార్టీకి చెం దిన వ్యక్తి, పశ్చిమగోదావరిలో నెలకు రూ.30కోట్లు చెల్లించ డానికి ఒప్పుకుని, అప్పుల పాలై, రైలుపట్టాల కింద తలపెట్టి బలవన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఇలా ఇసుక దోపి డీకి మారుపేరుగా మారిపోయింది. పూర్వం నుంచి ఇసుక తీత మీద ఆధారపడి జీవనం పొందుతున్న బోట్సుమన్ సొసైటీలను మూలకు నెట్టేసి, అక్రమంగా డ్రెడ్జింగ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం-జనసేన- బిజెపి కూటమి అఖండ విజయం సాధించడంతో పాటు వైసీపీ జిల్లాలో మచ్చుకు కూడా కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. ఈనేపధ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక విధానం తెస్తానని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. అన్నివర్గాలు ఆనందించాయి. భవన నిర్మాణ రంగం, సొంతంగా ఇల్లు కట్టుకునేవారు, అన్నివర్గాలు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఇసుక ర్యాంపులన్నీ ఆగిపోయాయి. దీనితో ఇసుక కొరత ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారంరాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక విధానం మీద చర్చినట్టు సమాచారం. త్వరలోనే కొత్త ఇసుక విధానం రాబోతుంది.

ఇసుక నిల్వలు అంచనా

ఇంతవరకూ వైసీపీ గూండాగిరికి బెదిరిపోయి, వాళ్లు చెప్పినట్టు వ్యవహరించిన అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టప్రకారం నడుచుకుంటామని చెబుతున్నారు. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా చేరిన పి.ప్రశాంతి కూడా గట్టిగా ఉంటూ, ఈ అధికార్లను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో వైసీపీలో కనీసం చట్టం, నిబంధనలు అనే మాట ఎత్తని అధికారులు, చంద్రబాబు సీఎంగానే అందరూ చట్టం జపం చేస్తున్నారు. ఇసుక ర్యాంపులలోకి వెళ్లి, యంత్రా లను సీజ్ చేస్తున్నారు. అంతేకాదు. ప్రస్తుతం జిల్లాలో స్టాక్ పాయింట్లలోనూ, గోదావరి ర్యాంపులలోనూ ఉన్న ఇసుక ఎ న్ని టన్నులు ఉంటుందనే అంచనా వేయడం మొదలు పెట్టారు. సోమవారం లాలాచెరువు, కడియపులంక, కాతేరు వంటి ప్రాంతాలలో లెక్కలువేయగా, మంగళవారం పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో పర్యటించి లెక్కలు కట్టడం మొదలుపెట్టారు. బుధవారంనాటికి జిల్లాలో ప్రస్తుతం ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయనేది స్పష్టత రానుంది.

● జిల్లాలో ర్యాంపుల వివరాలు

జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియంపులంక (బుర్రిలంక), సీతానగరంమండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం,పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు-2, తీపర్రు-3, పెండ్యాల, కానూరు ర్యాంపులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2, కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులు ఉన్నాయి. ఇక అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండ గుంట రేవు, అరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతో పాటు మొత్తం 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టువైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులు. గాయత్రీ -1నుంచి 8, కోటి లి ంగాల 1,3,4,5, కాతేరు 1నుంచి 15ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులు ఉన్నాయి. మొత్తం 97బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

నూతన చట్టాలపై అవగాహన

ముమ్మిడివరం, జూలై 2: నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య పేర్కొన్నారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఎస్ఐ బి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికసురక్షిత సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి చట్టాలు దోషులకు తక్షణం శిక్ష పడే విధంగా రూపొందించబడ్డాయన్నారు. సదస్సులో పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి పాలభిషేకం



ఆత్రేయపురం, జూలై 2: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని పండగలా నిర్వహించినట్టు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు పేర్కొన్నారు. మంగళవారం వెలిచేరు శివారు యూజీపాలెంలో పెన్షన్‌దారులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనపాల్గొన్నారు. ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ మిద్దే శ్రీరామమూర్తి, పాపారావు పాల్గొన్నారు.

చంద్రబాబు, వేగుళ్ల చిత్రపటాలకు పాలభిషేకం

రాయవరం, జూలై 2: పసలపూడి శెట్టిబలిజ వీధిలో ఫించన్‌దారులు, టీడీపీ నాయకులు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. టీడీపీ అమలాపురం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు వైఆర్‌కే పరమహంస మట్లాడుతూఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌దారులకు జూలై నెలలో రూ.7వేలు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గుత్తుల శ్రీని వాస్, కడియాల వెంకటరమణ, చింతపల్లి వెంకట రమణ, పిల్లి వెంకట రమణ, కుడుపూడి సత్యనారాయణ, ఉమా శ్రీనివాసు, టీడీపీ నాయకులు, పింఛన్‌దారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గ్రామశాఖ కార్యకర్తలకు ఇబ్బంది

మామిడికుదురు, జూలై 2: మామిడికుదురులో ఐదేళ్ల క్రితం టీడీపీ కార్యకర్తగా ఉన్న మెండా వెంకటేశ్వరరావు ప్రవర్తన గ్రామశాఖ కార్యకర్తలకు ఇబ్బందిగా ఉందని టీడీపీ మామిడికుదురు గ్రామశాఖ సమావేశం తీర్మానించింది. సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు కంచి విశ్వనాథం అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడారు. అతన్ని ఏ పార్టీ కార్యక్రమానికి పిలవడం లేదన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొత్త కావడంతో ఆ పరిస్థితిని ఆసరాగా తీసుకుని సదరు కార్యకర్త అధికార కార్యక్రమాల్లో పాల్గొనడం ఇబ్బందికరంగా ఉందని సమావేశం ద్వారా తీర్మానించారు. కార్యక్రమంలో ఈలి శ్రీనివాస్, సాపే ఏకాదశి, అప్పారి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి శంకరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, గోకవరపు శ్రీను, నామన రాధాకృష్ణమనోహర్, పెచ్చెట్టి భాస్కరరావు, యింటి గణపతి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, జూలై 2: వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌వో బి.అప్పారావు అధ్యక్షతన జాతీయ కీటకజనిత వ్యాధినియంత్రణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దోమలు వృద్ధిని అరికట్టాలన్నారు. పీహెచ్‌ఎన్ మేరికృప, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

అంబాజీపేట, జూలై 2: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో-2 మోకా ప్రకాష్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా కె.పెదపూడిలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగామౌలిక వసతులు కల్పించి విద్యను అందిస్తున్నామన్నారు. సీఆర్పీ పి.గోవిందరాజు సిబ్బంది పాలల్గొన్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలి

ముమ్మిడివరం, జూలై 2: కొత్తగా అమలులోకి తీసుకువస్తున్న చట్టాల వల్ల ప్రజాస్వామ్యంలోని వ్యవస్థకు, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే విధంగా ఉన్నందున వాటిని రద్దు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండు చేశారు. మంగళవారం ముమ్మిడివరంలోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన న్యాయవాదుల సంఘ సమావేశం జరిగింది. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయకుండా ప్రిలిమినరీ ఎంక్వైరీ చేసేవిధంగా పోలీసు కస్టడీ 14రోజుల నుంచి 90 రోజులకు పెంచడం, స్టేషన్ బెయిల్‌కు సంబంధించి పోలీసువారికి విస్తృత అధికారాలు కల్పిస్తూ ఈచట్టాలు రూపొందించడం జరిగిందన్నారు. ఈచట్టాలను తక్షణం రద్దు చేయాలని వారు డిమాండు చేశారు. ఎం.వెంకటేశ్వరరావు, రామాయణం మునేశ్వరరావు, జి.శ్రీధర్, జి.నరేష్, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన సిద్ధాంతాల రూపకల్పన ఘనత కార్ల్‌మార్క్స్, అంబేడ్కర్‌లదే

సాంస్కృతిక వేదిక నాయకుడు చల్లా రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చల్లా రవికుమార్

అమలాపురం టౌన్, జూలై 2: సమసమాజ స్థాపన కోసం నూతన సిద్ధాంతాలను రూపొందించిన ఘనత కార్ల్ మార్క్స్, అంబేడ్కర్‌లకు దక్కుతుందని సాంస్కృతిక వేదిక నాయకుడు డాక్టర్ చల్లా రవికుమార్ పేర్కొన్నారు. జంతువులను, సర్పాలను, చెట్లను, పుట్లను దైవంగా కొలిచే దేశంలో సాటి మనుషులను మనుషులుగా చూడకపోవడం దారుణమన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో 'అంబేడ్కరిజం-మార్క్సిజం సారుప్యత-ఆచరణ' అంశంపై జిల్లా స్థాయి సదస్సును డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్ల్‌మార్క్స్, అంబేడ్కర్ ప్రాథమిక సిద్ధాంతాలను, వారి తాత్విక, ఆర్థిక, సామాజిక భావాల మధ్య సారూప్యతను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలంక బౌద్ధ భిక్షు బోధిహీన్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలకు అంబేడ్కర్ ప్రభావితమై సమత, కరుణ ఆధారంగా రక్తపాత రహితమైన సమాజ నిర్మాణానికి కృషి చేశారన్నారు. కుల నిర్మూలన ద్వారానే అది సాధ్యమవుతుందని నమ్మారన్నారు. ఒక గుడి నిర్మిస్తే వంద మంది భిక్షగాళ్లు పుట్టుకొస్తారని, అదే ఒక పాఠశాల నిర్మిస్తే వంద మంది మేధావులు పుట్టుకొస్తారని అంబేడ్కర్ చెప్పిన మాటలను ఈసందర్భంగా గుర్తు చేశారు. సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీకుమార్ మాట్లాడుతూ బూర్జ్వా సమాజాన్ని కూలదోసి సమసమాజ స్థాపన కోసం లాల్-నీల్ శక్తులు ఏకం కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కులతత్వం, మత తత్వం పేరుతో ప్రజలను విడగొట్టే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం జిల్లా వాసులు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరు సాధించామని వివరించారు. సామాజిక కార్యకర్త కోనాల లాజర్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. నాయకులు వడ్డి నాగేశ్వరరావు, నకిలే పృథ్వీరాజ్, ఎస్.తులసీరావు, కారెం వెంకటేశ్వరరావు, పెయ్యల పరశురాముడు, జి.మల్లేశ్వరరావు, మాగాపు ఈశ్వరరావు, బూరిగ ఆశీర్వాదం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

మలికిపురం, జూలై 2: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. విద్యాభివృద్ధికి ఆటంకంగా మారిన 117జీవోను రద్దు చేయాలని కోరారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మాత్రమే వేయాలని కోరారు. 117జీవో ద్వారా 3,4 తరగతులను హైస్కూళ్లలో కలపడం వల్ల ప్రాథమిక విద్యకు ఆటంకంగా మారిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎస్టీయూ ఉపాధ్యాయుల డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గుబ్బల శ్రీనివాస్, యు.గిరిబాబు, కృష్ణప్రసాద్, ఉండపల్లి సత్యనారాయణ, ఈద వివేకానంద, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి కల్యాణం

కె.గంగవరం, జూలై2:యండగండిలో సోమేశ్వరస్వామి శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక నాగేశ్వరరావు బ్రహ్మత్వంలో రుత్వికులు శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.

ఐదేళ్లలో ఒక్క విద్యుత్ స్తంభం వేయించలేకపోయాను

వైసీపీ ఎంపీపీ మల్లిబాబు ఆవేదన



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిబాబు

అంతర్వేది, జూలై 2: ఐదేళ్లలో మండలంలో ఒక్క విద్యుత్ పోల్ కూడా ఎక్కడా వేయించలేకపోయానని వైసీపీ ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిశ శాఖల అధికారులతో పాటు పదహారు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని గ్రామాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంత మంది అధికారులు గత పాలనలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొనలేదు, కూటమి ప్రభుత్వం రావడంతో మంగళవారం పండుగ వాతావరణంలా సర్వసభ్య సమావేశం జరిగింది. తాగునీటి సమస్యలు, రోడ్లు, వైద్యం, విద్య, విద్యుత్, ఇరిగేషన్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో చర్చించారు. ముందుందు మంచి రోజులు వస్తున్నాయని ఎంపీపీ వీరా మల్లిబాబు అనడంతో సభలో పాల్గొన్న వారంతా చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్, ఎన్ఆర్జీఎస్, మహిళా సమాఖ్య మండలికి సంబంధించిన అధికారులతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ యూనస్ సూచనలిచ్చారు. తీర ప్రాంత గ్రామాలు ముంపునకు గురవుతున్నాయంటూ ఎంపీటీసీ చొప్పల బాబూరావు, ఉండపల్లి సాయికుమారిఅంజి, ఎంపీపీ మల్లిబాబుకు, ఆయాశాఖల అధికారులకు వినతులు అందించారు. మండల అభివృద్ధిపై ఎటువంటి కార్యాచరణ చేపడుతున్నారని మండల స్పెషల్ అధికారి హర్షవర్ధన్‌ను కోఆప్షన్ సభ్యుడు బళ్ల నోబుల్‌కుమార్ అడిగారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల అందరికీ అందేలా చూస్తామని, అలాగే మత్స్యకారుల అభ్యున్నతికి, ఆక్వారంగ అభివృద్ధిపై మాట్లాడారు. గొంది వీవీమెరక గ్రామాల్లో సరైన మంచినీటి సదుపాయం లేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించగా త్వరలోనే ఎమ్మెల్యే దేవవరప్రసాద్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దార్ పెద్దిరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీనామా చేయలేదు.. ఉద్యోగాలివ్వండి..



సమావేశమైన వలంటీర్లు

మామిడికుదురు, జూలై 2: గత ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గకుండా తాము వలంటీరు ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, తమకు వలంటీరుగా తిరిగి ఉద్యోగాలివ్వాలని మండలానికి చెందిన పలువురు వలంటీర్లు మంగళవారం సమావేశమై ప్రభుత్వానికి విన్నవించారు. రాజీనామా చేయని వలంటీర్లను విధుల్లోకి తీసుకుని రూ.10వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలంటూ కోరారు. 107మంది రాజీనామా చేయకుండా ఉన్నామని, తమను విధుల్లోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. కొల్లు లక్ష్మణ్, మహ్మద్ రఫీ, గాలిదేవర దుర్గారావు, బాలం వెంకట్, చింతా గోపి, కుడుపూడి రూపిణి, కొనుకు దుర్గాస్వరూపిణి, పల్లి జ్యోతి, గంధం మహేశ్వరి, కట్టా వెంకటరమణ, మానేపల్లి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో మోదీ, చంద్రబాబు, పవన్ ఫొటోలు

అల్లవరం, జూలై2: గోడితిప్ప పంచాయతీ వద్ద సర్పంచ్ చిట్టినీడి శ్రీదేవి, అల్లవరం పంచాయతీ వద్ద సర్పంచ్ బొమ్ము బాలవేణి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు ఏర్పాటుచేశారు. మాజీ సర్పంచ్‌లు ఎన్.సుదర్శనరావు, మేడిద శంకరరావు, కంకిపాటి వీరబాబు, లంకాడి సత్యనారాయణ, కొల్లు దుర్గ, ఎంపీటీసీ ఎన్.మౌనిక, బండిగుప్తాపు సత్తిబాబు, తోరం చిన్న బ్బులు, పి.ప్రకాష్, కార్యదర్శులు ఎస్.రాజమోహన్, రవిరాజుపాల్గొన్నారు. కొమరగిరిపట్నం పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.విజయలక్ష్మి, దాట్ల గోపి రాజు, మంతెన సురేష్‌రాజు, గునిశెట్టి రోహిణీకుమార్, కటికిరెడ్డి బాబి, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

కపిలేశ్వరపురం, జూలై 2: కేదార్లంకలో పంచాయతీ గోడనున్న నవరత్నాలు శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను గుర్తించినట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి మంగళవారం తెలిపారు. గ్రామకార్యదర్శి సీహెచ్‌వీవీ నరసింహరావు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామని అనుమానితులు అన్యం పురుషోత్తం, యర్రంశెట్టి రాజు, కామిశెట్టి సాయి లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లబ్ధిదారుల చెంతకే ఉద్యోగులు

ఆసుపత్రుల్లో లబ్ధిదారులకు పింఛన్ల అందజేత



ఉప్పలగుప్తం, అంబాజీపేటలలో పింఛన్ల అందజేత

అంబాజీపేట,జూలై2: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇరుసుమండకు చెందిన జోతుల త్రిమూర్తులుకు సర్పంచ్ భర్త, జనసేన నాయకుడు అక్కిశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసర్వేయర్ పి.శ్రీకాంత్ రూ.7వేలు పింఛన్ అందించారు. మండలంలో మిగిలిన పింఛన్లను ఆయా గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులు అందించారు.

మండపేట: తొలిరోజు 95శాతం, రెండోరోజు మంగళవారం 5శాతం పింఛన్లను లబ్ధిదారులకుఉద్యోగులు అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారికి వీఆర్వోలు, ఉద్యోగులు పింఛన్లు అందజేశారని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు.

పి.గన్నవరం: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పోతవరానికి చెందిన దివ్యాంగుడు కుసుమ దుర్గారావుకుసర్పంచ్ వడలి కొండయ్య సిబ్బందితో కలిసివెళ్లి రూ.6వేలు పింఛన్ అందించారు. కుమారుడు రెండు కళ్లకు శస్త్ర చికిత్స చేయించుకోవడంతో అతడికి తోడుగా ఉంటున్న పులపర్తి వెంకమ్మకు పింఛన్ అందించారు. సర్పంచ్, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, వీఆర్వో తులసిరావు, కె.చంద్రశేఖర్ ఉన్నారు.

కె.గంగవరం: పాణింగపల్లికి చెందిన బలసు సుబ్బారావు చౌదరి అనారోగ్యంతో బాధపడుతోన్నాడు. మండపేటలో కుమార్తె ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. పాణింగపల్లి సచివాలయ మహిళా పోలీస్ పద్మావతి మంగళవారం చౌదరికి పింఛన్ అందజేశారు.

ఆలమూరు: మండలంలోని పినపళ్లకు చెందిన వృద్ధుడు గోపిశెట్టి శ్రీరాములు అనారోగ్యంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ గ్రామ సచివాలయ సర్వేయర్ మొహినుద్దీన్ అక్కడికి వెళ్లి పింఛను అందజేశాడు.

కొత్తపేట: కొత్తపేట శివారు చిన్నగూళ్లపాలేనికి చెందిన వాసంశెట్టి వరలక్ష్మి ఇటీవల ప్రమాదానికి గురై రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతోంది. సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు సూచనతో సచివాలయ ఉద్యోగి నీలిమ రాజమహేంద్రవరం వెళ్లి వరలక్ష్మికి పింఛను అందించింది.

ఉప్పలగుప్తం: మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ 99.2శాతం జరిగినట్టు ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. ఎస్.యానానికి చెందిన పాము నాగభూషణం అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సచివాలయ ఉద్యోగి వై.అరుణోదయ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందించింది. యాక్సిడెంట్ కారణంగా నడవలేని స్థితిలో అంబాజీపేటలో ఉంటున్న భట్టుపాలేనికి చెందిన యాళ్ల సత్యనారాయణకు సచివాలయ సర్వేయర్ కె.బాలవెంకటేష్ పెన్షన్ అందించాడు.

ఎంపీడీవోకు అభినందనలు

రాజోలు, జూలై 2: మండలంలోని పదహారు గ్రామాల్లో 22 సచివాలయాల ఉద్యోగుల ద్వారా 9,732 పెన్షన్లకు 9,626మందికి పింఛన్లు అందజేయడంతో ఎంపీడీవో బాలాజీని మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, కడలి మోహన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

అతిసారపై అవగాహన సదస్సు

ఉప్పలగుప్తం, జూలై 2: చిన్నారుల్లో అతిసార లక్షణాల గుర్తింపు,నివారణ చర్యలపై ఎస్.యానాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారిణి దివ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆశాలు ఇంటింటికి వెళ్లి డయేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు, పీహెచ్‌ఎన్ మాణిక్యం, హెచ్‌వీ విజయకుమారి, రాధాకృష్ణ, మీనాక్షి, జ్యోతి, దుర్గపాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ తీర్థం

యానాం, జూలై 2: యానాం గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. ఇప్పటికే అమ్మవారిని స్థానిక చిన్నాసెంటర్లోని అంగన్‌గుడిలో అమ్మవారిని ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. అమ్మవార్ని గరగ నృత్యాలతో యానాం పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి తీర్థం నిర్వహించి రాత్రి 8గంటలకు నిప్పుల గుండం కార్యక్రమం నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి, పలువురు భక్తులు అమ్మవారికి దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

జనుపల్లెమ్మ తల్లి జాతర

అమలాపురం రూరల్, జూలై 2: జనుపల్లి గ్రామ దేవత జనుపల్లెమ్మ తల్లి తీర్థాన్ని మంగళవారం ఆలయం వద్ద నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొలిశెట్టి దుర్గారావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జాతర జరిగింది. గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామోత్సవం జరిపారు. తీర్థం సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

కూటమి నేతలకు పాలభిషేకం



అమలాపురం టౌన్, జూలై 2: భవన నిర్మాణ రంగ కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని కూటమి నాయకులు ప్రకటించడం హర్షణీయమని దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్, చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చిత్రపటాలకు సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కుసుమే నరసింహరాజు, పితాని బేబిరావు, వాసంశెట్టి గణేష్, బొక్కా శ్రీనివాస్, ముమ్మారి ఏసుబాబు, కముజు సుందరం, వై.అరుణకుమార్, రొక్కాల వెంకటరమణ, బొక్కా శ్రీనివాస్, మొగిలి సత్యనారాయణ, గిడ్ల రాంబాబు, కొప్పిశెట్టి వెంకటరమణ, కేతా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవు బీవీసీలో విద్యాబోధన సెమినార్

అల్లవరం, జూలై 2: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఎక్సలింగ్ ఆర్ట్ టీచింగ్ బియాండ్ లెక్చర్' అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఒకరోజు సెమినార్ నిర్వహించారు. అధ్యాపకులు బోధన విషయాలపైనే కాకుండా విద్యార్థులు, సహ ఉద్యోగుల పట్ల సామరస్య ధోరణితో మెలగాలని డాక్టర్ శ్రీపాద రామకృష్ణ కోరారు. కొత్త అంశాలపై అవగాహన పెంచుకుని నూతన రీతిలో విద్యా బోధన చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, డాక్టర్ కేబీఎస్‌డీ శర్మ, వివిధవిభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రెల్లుగడ్డ మాజీ సర్పంచ్ కుమారి మృతి

అల్లవరం, జూలై 2: రెల్లుగడ్డ మాజీ సర్పంచ్ నడింపల్లి కుమారి (47) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు భర్త నాగరాజు, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారి మృతికి సర్పంచ్ నడింపల్లి ఎస్ఎన్ వాసురాజు, ఎన్.చంటిరాజు, కల్వేపల్లి రామరాజు సంతాపం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 2: నీట్ పరీక్ష లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు డి.హరీష్, ఎం.రాజేష్, ఆర్.భాను ప్రకాష్, వి.నాగదుర్గా హనుమాన్, జి.తరుణ్‌సాయి, అభిలాష్ పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ఎక్కించొద్దు



ఆటో డ్రైవర్‌కు సూచనలు చేస్తున్న మంత్రి

రామచంద్రపురం, జూలై 2: పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను తీసుకువెళుతున్న ఆటో డ్రైవర్‌కు మంత్రి వాసంశెట్టి సుబాష్ క్లాస్ తీసుకున్నారు. మంగళవారం వెంయిన్ రోడ్డులో వెళ్తున్న ఆటోలో కిక్కిరిసి విద్యార్థులు కూర్చోవడంతో మంత్రి కాన్వాయ్‌ను ఆపారు. ఆటో డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయణికులను ఎక్కిస్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఈవిషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు.

విద్యను వ్యాపారం చెయ్యొద్దు

విద్యనువ్యాపారం చేయవద్దని మంత్రి సుబాష్ రామచంద్రపురంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల పుస్తకాలకు రూ.4500,ఫీజులు రూ.16 నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారని విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. విధానం మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరించిన జనసైనికులు

మండపేట, జూలై2: స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పవన్‌కల్యాణ్ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు మామిడాల మనోకృష్ణ సారథ్యంలో మంగళవారం అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. మారేడుబాకకు చెందిన పవన్‌అభిమానులు వేగుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, జూలై 2: లొల్ల లాకుల వద్ద మంగళవారం పురుషుడి మృతదేహం నీటిలో తేలింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

హోంగార్డ్ పరీక్ష ఫలితాలు విడుదల

యానాం, జూలై 2: పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న హోంగార్డు ఉద్యోగాల భర్తీకి ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. సోమవారం రాత్రి పోలీస్ శాఖ ఫలితాలు విడుదల చేసింది. యానాం రీజియన్‌కు సంబంధించి 25మంది ఎంపికయ్యారు. వీరికి ఈనెల 8నుంచి 11వరకు పుదుచ్చేరి పోలీస్‌శాఖ హెడ్ క్వార్టర్స్‌లో సర్టిఫికెట్స్ పరిశీలన చేస్తారు. వివరాలకు 0413-2277900, స్థానిక ఎస్పీ కార్యాలయంలో, పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అమలాపురం టౌన్, జూలై 2: అమలాపురం మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం సమీక్షించారు. కమిషనరు ఎస్.మనోహర్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఆదాయ వనరుల్లో పురోగతి, చేపట్టిన అభివృద్ధి పనులు ఏ దశల్లో ఉన్నాయో వివరించారు. శాఖల వారీగా సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే అనేక కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, జూలై 2: సీఎం చంద్రబాబునాయుడుని అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను చంద్రబాబుకు వివరించడంతో పాటు చేయాల్సిన అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పట్ల ప్రజల్లో వచ్చిన స్పందనను తెలియజేశారు. బండారు వెంట ఆయన తనయుడు సంజీవ్ ఉన్నారు.

జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ

అయినవిల్లి, జూలై 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జాతీయ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ జరిగింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పీడీ మధుసూదనరావు మాట్లాడుతూ మండలంలో 2023-24లో రూ.10కోట్ల పనులు జరిగాయన్నారు. 800పనులు జరగ్గా 3.15లక్షల మందికి పని కల్పించామన్నారు. ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణే లక్ష్యంగా పనిచేయాలి

అమలాపురం టౌన్, జూలై 2: డయేరియా నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర పేర్కొన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేరూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున నివారణా చర్యలు చేపట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పేరూరు పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డీవీ సత్యం, ఎంపీహెచ్‌ఈవో కె.సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కె.రాజ్యలక్ష్మి, వైద్య సిబ్బందిపాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సిద్దూ

రామచంద్రపురం, జూలై 2: పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రామచంద్రపురానికి చెందిన బత్తుల సిద్దూ ఎన్నికయ్యారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ చింతా రాజారెడ్డి, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు సాయిచరణ్ హర్షంవ్యక్తంచేశారు.

రాజవరంలో అగ్నిప్రమాదం

ఆత్రేయపురం, జూలై2: రాజవరంలో అగ్నిప్రమాదం సంభవించింది. గారపాటి గంగ, సుబ్బారావులకు చెందిన ఇటుక బట్టీ వద్ద కూలీలకు సామగ్రి నిల్వఉంచేందుకు ఏర్పాటుచేసిన షెడ్డులో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ అయింది. కూలీలసామగ్రి, బట్టీసామగ్రి, మోటార్లు దగ్ధమయ్యాయి. రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆపారు. రూ.10లక్షల ఆస్తి నష్టం ఏర్పడింది.

సొసైటీలకు పర్సన్‌ఇన్‌చార్జ్‌లు

పి.గన్నవరం, జూలై 2: సొసైటీలకు వైసీపీ ప్రభుత్వం హయాంలో నియమించిన త్రిమెన్ కమిటీ సభ్యులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీనామాలు చేశారు. జిల్లాలోని ఆయా సొసైటీలకు ప్రభుత్వ ఆదేశాలతో గతనెల28న పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు డివిజనల్ సహాయ అధికారి కె.రాధకృష్ణ తెలిపారు. పి.గన్నవరం, ఉడిమూడి, ముంగండ, నాగుల్లంక సొసైటీలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.వరప్రసాద్, నరేంద్రపురం సొసైటీకి అసిస్టెంట్ రిజిష్టర్ కె.చంద్రశేఖర్, కె.ఏనుగుపల్లి సొసైటీకి సీనియర్ ఇన్‌స్పెక్టర్ బి.రామ్ కుమార్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు.